సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



నగరంలో వినాయక చవితి ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. గురువారం గణనాథుల నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధానంగా విశాఖ సాగరతీరంలో గంగమ్మ ఒడికి గణనాథులు చేరారు. ఈ నిమజ్జన కార్యక్రమం పొద్దుపోయే వరకు కొనసాగింది.



వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం సంపత్ వినాయగర్ స్వామి అయోధ్య బాల రామ గణపతి అలంకారంలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం



సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం పలుకుతున్న న్యాయమూర్తులు

మహారాణిపేట: జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పి.ఎస్.నరసింహ గురువారం సాయంత్రం విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. వీరికి జిల్లా సెషన్స్ జడ్జి చిన్నంశెట్టి రాజు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పలువురు న్యాయమూర్తులు స్వాగతం పలికారు. వారంతా ఉదయం 09.30 గంటలకు రాడిసన్ బ్లూలో జరిగే ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లోను, ఉదయం 11.30 గంటలకు నొవోటల్ హోటల్‌లో జరిగే దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడ జరిగే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ సమావేశంలో పాల్గొంటారు.

నేటి నుంచి వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్



ఎంజీఎం మైదానంలో సిద్ధమవుతున్న స్టాళ్లు

మహారాణిపేట: బీచ్‌రోడ్‌లోని ఎంజీఎం మైదానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. పర్యాటక శాఖ, హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఫెస్టివల్‌లో ప్రముఖ స్టార్ హోటళ్లు పాల్గొంటున్నాయి. దాదాపు 40 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఆంధ్రా రుచులు, ప్రపంచ వంటకాలు, సిగ్నేచర్ వంటకాలతో పాటు, గోదావరి జిల్లాల ప్రత్యేకతలు, ఆర్గానిక్ వంటకాలు కూడా అందుబాటులో ఉంటాయి. అన్నీ సరసమైన ధరలకే లభిస్తాయి. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఈ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. ఈ ఫెస్టివల్‌కు ప్రవేశం ఉచితమని, ఈ మూడు రోజుల పండగలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

7న శ్రీవారి ఆలయం మూసివేత



రుషికొండలోని శ్రీవారి ఆలయం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని (టీటీడీ) ఈ నెల 7న సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా మూసివేయనున్నట్లు ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు పూజలు, దర్శనాలు నిర్వహించి.. మధ్యాహ్నం 1.50 గంటల నుంచి ఆలయాన్ని మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం నుంచి యథావిధిగా దర్శనాలు ఉంటాయని, భక్తులు గమనించాలని కోరారు.

నేడు 'సైన్స్ కాంక్లేవ్'



మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం 'సైన్స్ కాంక్లేవ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు తెలిపారు. అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఏఎస్‌టీసీ- హైదరాబాద్)తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్రాంటియర్స్ ఫర్ స్వర్ణాంధ్ర అండ్ వికసిత్ భారత్– 2047' అనే అంశంపై ఈ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరగనుందని, విద్యా పురస్కార గ్రహీత, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (కోల్‌కతా) డైరెక్టర్ ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

అన్నింటా మేటి

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటిన ఆంధ్ర విశ్వవిద్యాలయం

- 2023-24 విద్యా సంవత్సరానికి ర్యాంకుల ప్రకటన
- స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ విభాగంలో జాతీయ స్థాయిలో 4వ స్థానం, రాష్ట్రంలో ప్రథమ స్థానం
- విశ్వవిద్యాలయాల విభాగంలో జాతీయ స్థాయిలో 23వ ర్యాంకు కైవసం
- వైఎస్సార్ సీపీ హయాంలో యూనివర్సిటీ అభివృద్ధికి ఈ ఘనతే కొలమానం



విశాఖ సిటీ : ఆంధ్రా యూనివర్సిటీ చరిత్ర సృష్టించింది. జాతీయ స్థాయిలో మరోసారి ఘనతను చాటుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్స్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్)లో సత్తా చూపించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కొత్త ఊపిరులందుకుంది. విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలతో నాలుగేళ్ల కాలంలో యూనివర్సిటీ ప్రపంచస్థాయి గుర్తింపు సంపాదించుకుంది. గత ప్రభుత్వ హయాంలో నాక్ డబుల్ ప్లస్ గ్రేడ్, ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) రేటింగ్స్‌లో 4 స్టార్ రేటింగ్‌ను సొంతం చేసుకుంది. తాజాగా 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ విభాగంలో జాతీయ స్థాయిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 4వ స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో రాష్ట్రంలో నంబర్ వన్ స్థానాన్ని ఏయూ కైవసం చేసుకుంది. విశ్వవిద్యాలయాల విభాగంలో జాతీయ స్థాయిలో 23వ ర్యాంకును సొంతం చేసుకుంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సాధించిన ఏయూ ప్రగతికి కొలమానంగా మారింది.

అనేక సంస్కరణలతో ఘనత

వైఎస్సార్ సీపీ పాలనలో విద్యా రంగంలో అనేక సంస్కరణలకు నాంది పలికారు. ప్రతి విద్యా సంస్థ, వర్సిటీల్లో ఆలోచనలు.. ఆవిష్కరణలు.. అవకాశాలు అనే నినాదంతో విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థి అభివృద్ధికి మార్గదర్శిగా.. పరిశోధనలకు నిలయంగా ఏయూలో అనేక కీలక విభాగాలను, ఆవిష్కరణ కేంద్రాలను ప్రారంభించారు. వివిధ దేశాలు, యూనివర్సిటీలు, సంస్థల ఒప్పందాలు చేసుకున్నారు. విద్యార్థులను ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏయూ–నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను రూ.27 కోట్లతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో గతంలో లేని విధంగా సొంతంగా ఒక స్టార్టప్, ఇంకుబేషన్ సెంటర్ ఆ–హబ్‌ని తీర్చిదిద్దారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్), ఆర్‌ఐఎన్‌ఎల్ సహకారంలో హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో బయో ఆర్చర్ ఇంకుబేషన్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతర్జాతీయంగా జియో ఇంజనీరింగ్ ప్రాధాన్యతను ముందుగానే గుర్తించి జియో ఇంజనీరింగ్ విభాగాన్ని పటిష్టపరిచారు. రూ.67.5 కోట్లతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) సంయుక్తంగా ఏయూతో ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ని ఏర్పాటు చేశాయి. ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ కూడా సిద్ధమైంది. ఇలా అనేక నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

జాతీయ స్థాయిలో పెరిగిన ప్రతిష్ట

2019 తర్వాత ఏయూ విశేష ప్రగతి సాధించింది. జాతీయ స్థాయిలో ప్రతిష్టను ఇనుమడింపచేసుకుంది. ప్రధానంగా ఏయూ నాక్ డబుల్ ప్లస్ గ్రేడ్‌ని, 3.74 సీజీపీఏతో సాధించి సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఈ గుర్తింపు 2030 వరకు ఉంటుంది. ఆచార్యుల కొరత ఉన్న సమయంలో కూడా ఏయూ ఇంతటి విశిష్ట ర్యాంక్‌ని సాధించడంతోపాటు జాతీయ స్థాయిలో తొలి మూడు విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలిచింది. అలాగే స్టార్టప్‌ల ఆవిష్కరణలకు చేయూత అందించేందుకు ఏర్పాటు చేసిన ఆ–హబ్ ప్రారంభించిన కొద్ది కాలంలోనే దేశానికి దిక్సూచిగా మారింది. ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) ప్రకటించిన 4.0 స్టార్టప్ క్యాంపస్ విభాగంలో 4 స్టార్ రేటింగ్ సాధించింది. తాజాగా ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో కూడా సత్తా చాటింది.

59.20 స్కోర్‌తో 23వ ర్యాంకు

అత్యుత్తమ విద్యా విధానాలు, ఆవిష్కరణలు, సౌకర్యాలు, ఫలితాలు, అత్యుత్తమ ప్రమాణాలకు సాధించే విద్యా సంస్థలు, వర్సిటీలకు కేంద్ర ప్రభుత్వం ఏటా నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకులు కేటాయిస్తుంది. ఇన్‌స్టిట్యూషన్లకు ర్యాంక్స్ ఇవ్వడానికి ప్రధానంగా విద్యా బోధన, అభ్యాసం, వనరులు, గ్రాడ్యుయేషన్ ఫలితాలు, అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకు కేటాయిస్తారు. 2023 జూన్ నుంచి 2024 జూన్ విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ర్యాంకులు ప్రకటించింది. ఇందులో ఏయూ యూనివర్సిటీ కేటగిరీలో 59.20 స్కోర్‌తో 23వ ర్యాంకును సొంతం చేసుకుంది. ఇంజనీరింగ్ కేటగిరీలో 47.37 స్కోర్‌తో 88వ ర్యాంకు, మేనేజ్‌మెంట్‌లో 59.95 స్కోర్‌తో 29వ ర్యాంకు, ఫార్మసీలో 58.19 స్కోర్‌తో 31వ ర్యాంకు, డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీ 63.12 స్కోర్‌తో 16వ ర్యాంకు సాధించింది. అలాగే రాష్ట్రంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా ఏయూ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. ఈ ర్యాంకు ద్వారా దేశం, రాష్ట్రంలో అత్యుత్తమ యూనివర్సిటీలను గుర్తించే అవకాశం ఉంటుంది.

నేడు డీఎస్‌ఎన్‌ఎల్‌యూ స్నాతకోత్సవం

హాజరుకానున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

ఏయూ క్యాంపస్ : దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) సంయుక్త స్నాతకోత్సవం శుక్రవారం జరగనుంది. నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ గౌరవ అతిథిగా, వర్సిటీ మాజీ చాన్సలర్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిక్ జేకే మహేశ్వరి ప్రత్యేక అతిథిగా హాజరవుతారు. వర్సిటీ చాన్సలర్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారు. ఒకే వేదికపై 8వ, 9వ, 10వ, 11వ, 12వ స్నాతకోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో 900 మందికిపైగా పట్టాలను అందుకోనున్నట్లు వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు తెలిపారు. స్నాతకోత్సవం అనంతరం సబ్బవరంలోని వర్సిటీ ప్రాంగణంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకడమిక్ బ్లాక్–2 భవనాలను జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రారంభిస్తారు. అలాగే వర్సిటీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, మహాత్మా గాంధీ, దామోదరం సంజీవయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తారు.

ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఎంబీఏ(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్) సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ రెండేళ్ల కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫీజును 19వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆచార్యులకు అవార్డులు



వల్లీకుమారి



జాలాది రవి



దుర్గ ప్రసాద్ రావు



అరుణ్ కుమార్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు ఆచార్యులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, అణుభౌతిక శాస్త్ర విభాగం ఆచార్యులు దుర్గాప్రసాద్ రావు, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు వి.వల్లీ కుమారిలను ఎంపిక చేసి, ఉత్తర్వులు జారీ చేసింది. అవార్డులకు ఎంపికైన ఆచార్యులను ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ అభినందించారు. అలాగే డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వాణిజ్య విభాగంలో పని చేస్తున్న డాక్టర్ గెద్దాడ అరుణ్ కుమార్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఇతర అధ్యాపకులు ఆయన్ని అభినందించారు.

అధ్యాపకురాలి సేవలకు గుర్తింపు



దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల అధ్యాపకురాలు ఎం.రాధకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఆమె చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించింది. 1996లో స్కూల్ అసిస్టెంట్‌గా వీరనాయణంలో తన వృత్తిని ప్రారంభించిన రాధ, 2001లో నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. ఆ తర్వాత ఆమె పెందుర్తి, వడ్డాది, విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. అనంతరం దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సేవలందించిన ఆమె ప్రస్తుతం విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎందరో విద్యార్థులు ఆమె మార్గదర్శకత్వంలో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఏయూలో నేడు ఉపాధ్యాయ దినోత్సవం

90 మంది గురువులకు ఉత్తమ అవార్డులు

మహారాణిపేట/ఆరిలోవ: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏయూలోని అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ వేడుకలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. కాగా.. జిల్లాలో ఉత్తమ సేవలందించిన 90 మంది టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరిలో 8 మంది గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు, 4 గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఒక కేజీబీవీ ప్రిన్సిపాల్, 2 గురుకులాల పీజీటీలు, 5 ప్రైమరీ స్కూళ్ల హెచ్‌ఎంలు, ఒక కేజీబీవీ జేఎల్, ఒక కేజీబీవీ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు, ఒక కేజీబీవీ పీఈటీ, 46 మంది స్కూల్ అసిస్టెంట్లు, 21 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (వీరిలో ఒకరు అంధ దివ్యాంగులు) ఉన్నారని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులను సత్కరించి, వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని డీఈవో తెలిపారు.

మేయర్‌పై గరం..గరం

- పీలా వ్యవహారంపై సొంతపార్టీ కార్పొరేటర్లే అసంతృప్తి
- నిబంధనలు పక్కన పెట్టి స్టాండింగ్ కమిటీ సమావేశం
- పలు అంశాలపై సభ్యుల నిలదీత



పలు అంశాలపై వివరణ కోరుతున్న స్థాయీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి

దాబాగార్డెన్స్: నగర మేయర్ పీలా శ్రీనివాసరావు వ్యవహారశైలిపై సొంత పార్టీ కార్పొరేటర్లే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారని, అధికారులతోనూ సమన్వయం పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. దీనికి నిదర్శనంగా గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని చూపుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 97ఏ ప్రకారం కొత్తగా ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ తొలి సమావేశం కమిషనర్ నిర్ణయం ప్రకారం నిర్వహించాలి. కానీ మేయర్ కార్యాలయం ఈ నిబంధనను పక్కనపెట్టి, కార్యదర్శి సంతకంతో ఒకరోజు ముందు మాత్రమే అజెండాను సభ్యులకు పంపింది. దీనివల్ల అజెండాలోని అంశాలను పరిశీలించడానికి తగినంత సమయం దొరకలేదని సభ్యులు మండిపడుతున్నారు. మేయర్ ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తున్నారని, ఇది నగర పాలనకు మంచిది కాదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కమిషనర్‌కు వినతి: పైన పేర్కొన్న విషయమై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్, జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యురాలు సాడి పద్మారెడ్డి మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతి పత్రం అందజేశారు. సమావేశ నోటీసు రద్దు చేయాలని, స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిబంధనల ప్రకారం కచ్చితంగా నిర్వహించాలని ఆమె అభ్యర్థించారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం: స్థాయీ సంఘం సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. 198 అంశాలు అజెండాలో పొందుపరచగా, సభ్యులు చర్చించిన అనంతరం 194 అంశాలు ఆమోదించారు. 4 అంశాలు వాయిదా వేశారు. సమావేశంలో సభ్యులు కొణతాల నీలిమ, గంకల కవిత, దాడి వేంకటరామేశ్వరరావు, మొల్లి హేమలత, సేనాపతి వసంత, గేదెల లావణ్య, మాదంశెట్టి చిన్నతల్లి, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు, మొల్లి ముత్యాలు, సాడి పద్మారెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

నిర్వహణకే రూ.35 కోట్లా?

తాగునీటి సరఫరా, నిర్వహణ అంశాలపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో అసంపూర్తిగా ఉన్న పనులు, వాటి నిర్వహణపై అధికారులను ప్రశ్నలతో నిలదీశారు. స్టాండింగ్ కమిటీ సభ్యుడు రాపర్తి త్రివేణి వరప్రసాదరావు మాట్లాడు తూ నగరంలో టెలిఫోన్ వైర్ల కోసం రోడ్లపై తవ్విన గుంతలను సరిచేసే బాధ్యత ఎవరిదని అధికారులను ప్రశ్నించారు. గత ఆరు నెలల్లో కేబుల్ కంపెనీల నుంచి ఎంత నష్టపరిహారం వసూలు చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతుల కోసం కొనుగోలు చేసిన మెటీరియల్‌ను ఎక్కడపడితే అక్కడ వదిలివేయడంతో అవి తుప్పు పట్టిపోతున్నాయని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. మరో సభ్యురాలు సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ మోటార్లు ఆగిపోతే వాటికి కావాల్సిన స్పేర్ పార్ట్స్ కూడా లేకపోవడంపై మండిపడ్డారు. 'మోటార్ల నిర్వహణ కోసం రూ.35 కోట్లు కేటాయిస్తున్నారు, కానీ స్పేర్ పార్ట్స్ లేకపోతే ఆ నిధులు దేనికి?' అని ప్రశ్నించారు. తాగునీటి సరఫరాలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని ఈ సందర్భంగా ఆమె అధికారులను కోరారు.

ఇలా అయితే ర్యాంకు వెళ్లిపోవడం ఖాయం

పారిశుధ్య నిర్వహణపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2025–26 సంవత్సరానికి 49.66 లక్షల అంచనా వ్యయంతో కొబ్బరి చీపుర్ల కొనుగోలు ప్రతిపాదన చర్చకు వచ్చినప్పుడు సభ్యులు అధికారులను నిలదీశారు. సభ్యురాలు సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు చీపుర్లు వంటి ఉపకరణాలు అందజేసే ముందు స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో సభ్యుడు రాపర్తి త్రివేణి వరప్రసాదరావు మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. స్వచ్ఛభారత్ ర్యాంకింగ్‌లో జీవీఎంసీ 9వ ర్యాంకుకు పడిపోయిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది ర్యాంకు 90కి పడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు.

ఈ అంశాన్ని దాట వేశారు..

ఏయూ ప్రాంగణాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ కోసం ప్రైవేట్ కార్మికులకు చెల్లింపుల అంశంపై స్టాండింగ్ కమిటీలో చర్చ జరిగింది. ఈ అంశాన్ని సభ్యురాలు సాడి పద్మారెడ్డి లేవనెత్తారు. మే 12న ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ, ఏయూ గ్రౌండ్స్‌లో మూడు షిఫ్టుల్లో 900 మంది ప్రైవేట్ కార్మికులను రోజువారీ వేతనం రూ. 549 చొప్పున నియమించడంపై ఆమె ప్రశ్నించారు. అసలు ఏయూ ప్రాంగణాల్లో జీవీఎంసీ పారిశుధ్య పనులను ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఆమె ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, మేయర్ పీలా శ్రీనివాసరావు 'తర్వాత చర్చిద్దాం' అంటూ ఆ అంశాన్ని దాటవేశారు. దీంతో పద్మారెడ్డితో పాటు ఇతర సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పదేళ్ల తర్వాత యుద్ధ నౌకల పండగ

- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ
- 2016 తర్వాత ఆతిథ్యమిస్తున్న భారత్
- విశాఖ కేంద్రంగా మరోసారి నిర్వహణకు సిద్ధం
- 145 దేశాలకు ఆహ్వానం పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ఇండియన్ నేవీ
- ఈసారి చైనాకు ఆహ్వానించే అంశంపై రక్షణ మంత్రిత్వ శాఖ చర్చలు



సాక్షి, విశాఖపట్నం : విశాఖ మరోసారి అంతర్జాతీయ కార్యక్రమానికి వేదిక కానుంది. 2026 ఫిబ్రవరిలో భారత నౌకాదళం అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్–2026 విన్యాసాలను నిర్వహించనుంది. దాదాపు పదేళ్ల తర్వాత విశాఖలో జరుగుతున్న ఈ యుద్ధ నౌకల ప్రదర్శన కోసం దాదాపు 145 దేశాలను ఆహ్వానించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే చైనాను ఆహ్వానించాలా వద్దా అనే విషయంపై ప్రస్తుతం రక్షణ మంత్రిత్వ శాఖలో చర్చలు జరుగుతున్నాయి. తూర్పు నావికాదళ ప్రధాన కేంద్రంగా ఉన్న విశాఖ.. గతంలో 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్ విన్యాసాలను విజయవంతంగా నిర్వహించింది. అలాగే 2024లోనూ రికార్డు స్థాయిలో మిలాన్ విన్యాసాలు జరిగాయి. ఇప్పుడు ఈ అంతర్జాతీయ యుద్ధ నౌకల ప్రదర్శనతో విశాఖ ప్రాముఖ్యత మరింత పెరగనుంది.

ఏమిటీ ఫ్లీట్ రివ్యూ

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు సాగరంలో ఎదురుదాడికి దిగగల సత్తా చాటేందుకు నావికాదళ విన్యాసాలు ప్రపంచదేశాలకు చాటేందుకు నిర్దేశించినవే ఫ్లీట్ రివ్యూలు. భారత సుప్రీం కమాండర్ అయిన దేశాధ్యక్షుని సమక్షంలో ఈ విన్యాసాలు చోటు చేసుకుంటాయి. ఇప్పటికే భారత్ 2001లో ముంబైలోనూ 2016లో విశాఖలో ఐఎఫ్‌ఆర్‌ని నిర్వహించిన అనుభవం ఉంది. ఇప్పుడు మరోసారి అంతర్జాతీయ యుద్ధనౌకల విన్యాసాలకు వేదికగా విశాఖ నిలుస్తోంది. ప్రపంచానికే నాగరికత నేర్పిన దేశంలో తొలి టైడల్ డాక్‌ని భారత్ నిర్మించింది. చంద్రగుప్త కాలం నుంచే భారతీయులు సముద్రయానంపై మంచి పట్టు సాధించినట్లు చరిత్ర పేర్కొంటున్నది. నాటి నుంచి నేటి అణుజలాంతర్గాముల నిర్మాణంలోనూ స్వయంచాలితంగా ఎదిగిన భారత్ ప్రపంచదేశాలను ఆకర్షిస్తూనే ఉంది. అంతర్జాతీయ యుద్ధనౌకల ప్రదర్శనతో మరోసారి ప్రపంచదేశాల దృష్టి విశాఖ తీరం వైపు సాగనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 24 వరకూ ఐఎఫ్‌ఆర్‌తో పాటు మిలాన్–2026ని విశాఖలో నిర్వహించనున్నారు.

తొలిసారి 25.. మూడోసారి 145

2001లో భారత్‌లో తొలిసారి ముంబైలో ఐఎఫ్‌ఆర్ నిర్వహించిన సమయంలో 25 దేశాలు హాజరయ్యాయి. 2016లో విశాఖలో నిర్వహించినప్పుడు 51 దేశాలు హాజరయ్యాయి. 2025లో ఇండోనేషియాలోని బాలి సముద్ర తీరంలో ఐఎఫ్‌ఆర్‌లో 30 దేశాలు పాల్గొన్నాయి. ఈసారి మాత్రం రికార్డు స్థాయిలో 145 దేశాలకు ఆహ్వానం పంపించాలని భారత్ నిర్ణయించింది. ఈ మేరకు ఇండియన్ నేవీ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ.. ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ విన్యాసాల్లో భారత నావికాదళానికి చెందిన సర్ఫేస్ యుద్ధనౌకలు, జలాంతర్గాములతోపాటు నావల్ ఏవియేషన్ విమానాలు పాల్గొంటున్నాయి. ఢిల్లీ క్లాస్, రాజ్‌పుత్ క్లాస్, కమోర్తా క్లాస్, విశాఖ క్లాస్, శివాలిక్ క్లాస్, బ్రహ్మపుత్ర క్లాస్, నీలగిరి మొదలైన తరగతులకు చెందిన యుద్ధ నౌకలతో పాటు జలాంతర్గాములు, యుద్ధనౌకలకు అన్నివిధాల సహకారాన్ని అందించే ఫ్లీట్ టాంకర్లు, టార్పెడో రికవరీ వెసల్స్, గ్రీన్‌టగ్స్ సత్తా చాటనున్నాయి. అలాగే కోస్ట్ గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఓటీ) వంటి ఇతర సముద్ర సంస్థలకు చెందిన నౌకలు ఈ ఫ్లీట్ రివ్యూలో భాగస్వామ్యం కానున్నాయి.

చైనాని పిలవాలా.. వద్దా.?

ఇటీవల చైనాతో చర్చలు జరిగిన నేపథ్యంలో..ఐఎఫ్‌ఆర్‌కు చైనాను ఆహ్వానించాలా వద్దా అనే అంశంపై రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్చలు జరుపుతోంది. 2016లో నిర్వహించిన ఐఎఫ్‌ఆర్‌కు చైనాని ఆహ్వానించగా రెండు యుద్ధ నౌకలు, ఓ జలాంతర్గామి విన్యాసాల్లో పాలుపంచుకున్నాయి. ఈసారి ఆహ్వానం అందించాలా వద్దా అనే దానిపై త్వరలోనే స్పష్టత వస్తోందని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఇప్పటి వరకూ భారత్‌లో జరిగే ఏ విన్యాసాలకు పాక్‌ని ఆహ్వానించలేదు. రాబోతున్న ఐఎఫ్‌ఆర్, మిలాన్–2026కి కూడా ఆహ్వానం లేదని రక్షణ వర్గాలు తెగేసి చెబుతున్నాయి. ఆసియా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా ఖండాలకు చెందిన దేశాలు ఐఎఫ్‌ఆర్‌లో భాగస్వామ్యం కాబోతున్నాయి.

ఐఎఫ్‌ఆర్ –2026 నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి విశాఖలో జరగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ–2026 నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో సీపీ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత, కమాండర్ వై.కె. కిశోర్ తో పాటు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులతో పలు అంశాలను చర్చించారు. ఐఎఫ్‌ఆర్‌తో పాటు, మిలాన్ వేడుకలు కూడా అదే సమయంలో జరుగుతాయని, అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వేడుకలకు రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖులతో పాటు సుమారు 135 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఏఐ, గెయిల్, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థలు చేపట్టిన అభివృద్ధి పనులను నవంబర్ రెండో వారంలోపు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రోడ్లు, డ్రైయిన్లు, కాలువల ఆధునికీకరణ, మారుతీ జంక్షన్ వద్ద జరుగుతున్న వంతెన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

భక్తి ముసుగులో వ్యాపారానికి బ్రేక్

- 111 అడుగుల వినాయక మండపానికి విద్యుత్ సరఫరా కట్
- దర్శనాలు నిలిపివేసిన అధికారులు
- అనుమతులు రద్దు చేస్తూ జీవీఎంసీ కమిషనర్ ఉత్తర్వులు
- ముగిసిన సుందర వస్త్ర మహాగణపతి ఉత్సవాలు


గాజువాకలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి మండపాన్ని మూసివేయించిన అధికారులు


మూసివేసిన ఆర్టీసీ డిపో సమీపంలోని కోటి లింగాల గణేశుడు మండపం

గాజువాక : భారీ విగ్రహం పేరుతో గాజువాకలో వినాయక ఉత్సవాలను ప్రారంభించిన నిర్వాహకులకు అధికారులు షాకిచ్చారు. భక్తి ముసుగులో వ్యాపారానికి తెరలేపారన్న ఫిర్యాదులపై స్పందించిన అధికారులు వినాయక ఉత్సవాన్ని ముగించాలని నిర్వాహకులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సంబంధిత మండపానికి విద్యుత్ సరఫరా నిలిపివేసి భక్తులను అక్కడ్నుంచి పంపించేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరుతో పాతగాజువాకలోని లంకా మైదానంలో 111 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. లక్ష చీరలతో సుందర వస్త్ర మహాగణపతి పేరిట ఉత్సవాలను గత నెల 27న ప్రారంభించారు. 21 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించడం కోసం జీవీఎంసీ నుంచి సింగిల్ విండో ప్రాసెస్‌లో నిర్వాహకులు అనుమతి తీసుకున్నారు. అయితే భక్తి ముసుగులో వ్యాపారానికి తెరలేపారని, కమర్షియల్‌గా టికెట్లు అమ్మడం, పార్కింగ్‌కు ఫీజు వసూలు చేయడం, దుకాణాలు పెట్టించి డబ్బులు వసూలు చేశారంటూ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదులపై స్పందించిన అధికారులు నిర్వాహకులకు నోటీసులను కూడా అందజేశారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ఉత్సవాల నిర్వహణ కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ జీవీఎంసీ కమిషనర్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. పోలీసులు, విద్యుత్ సిబ్బంది సహకారంతో మండపానికి, అక్కడి దుకాణాలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. దర్శనాలను నిలిపివేసిన పోలీసులు మండపాన్ని మూసేసి భక్తులను అక్కడ్నుంచి పంపించేశారు. గాజువాక లంకా మైదానంలో వినాయక ఉత్సవాలు ముగిశాయని అధికారవర్గాలు ఈ సందర్భంగా పేర్కొన్నాయి.

కోటి లింగాల గణపతి మండపానికి కూడా..

గాజువాక ఆర్టీసీ డిపో సమీపాన కోటి శివలింగాలతో 108 అడుగుల ఎత్తయిన భారీ వినాయక విగ్రహ మండపానికి కూడా జీవీఎంసీ అధికారులు షాక్ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు వ్యవహరించడంపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

ఉత్తరాంధ్ర మైనార్టీ విద్యాభివృద్ధి డీడీగా ఖాజా రహమతుల్లా



మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర ప్రాంతీయ మైనార్టీ విద్యా అభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా డాక్టర్ ఖాజా రహమతుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తరాంధ్ర మైనార్టీల విద్య, ఉద్యోగ శిక్షణకు సంబంధించిన కార్యక్రమాలను ఈ సంస్థ ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తుంది. ప్రస్తుతం ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డాక్టర్ ఖాజా, వినియోగదారుల సంరక్షణ కమిటీ సభ్యుడిగా, గతంలో ప్రధానమంత్రి 15 అంశాల జిల్లా కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు. ఈ పదవికి అవకాశం కల్పించినందుకు ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబు, పాఠశాల హెచ్ఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన

ఉద్యోగికి ఆరేళ్ల జైలు, రూ.60వేల జరిమానా

విశాఖ లీగల్: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉద్యోగికి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.60 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ గురువారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో నిందితుడు అదనంగా నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసు వివరాలను అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ వెల్లడించారు. నిందితుడు, 30 ఏళ్ల డబ్బేరు సాయికుమార్ ఇండియా బీపీవో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గుమస్తాగా పనిచేసేవాడు. అతను కార్యాలయంలో పనిచేసే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, వారిని వేధిస్తూ అభ్యంతరకరమైన ఈ-మెయిల్స్, మెసేజ్‌లు పంపేవాడు. ఈ విషయమై కార్యాలయ అధికారులు అంతర్గత విచారణ జరపగా, ఆరోపణలు నిజమని తేలింది. దీంతో 2024 ఏప్రిల్ 10న ఆ కంపెనీ పరిపాలనాధికారి మీసాల లోకేష్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సైబర్ క్రైం పోలీస్ అధికారి కె.భవానీ ప్రసాద్ ఈ కేసును దర్యాప్తు చేసి, నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 354(డి), సైబర్ క్రైం చట్టం 2000లోని సెక్షన్లు 66(సి)(డి), 67(ఎ) కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో, రెండు నేరాలకు గానూ నిందితుడికి ఒక్కో నేరంలో మూడేళ్ల చొప్పున జైలు శిక్ష, ఒక్కో నేరంలో రూ. 30 వేలు చొప్పున మొత్తం రూ.60వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే, ఒక్కో నేరంలో రెండు నెలల చొప్పున అదనపు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు.

11న స్టీల్‌ప్లాంట్ ఈవోఐ, ప్రైవేటీకరణ రద్దు కోసం సభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం విశాఖ జిల్లా నాయకులు

దాబాగార్డెన్స్: ఈవోఐ పేరిట విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం తక్షణం నిలిపేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు పాతగాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు. విశాఖలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కే ఎస్వీ కుమార్, పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావులతో కలిసి బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, చట్ట విరుద్ధంగా తొలగించిన 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. వారి స్థానంలో ఇతర రాష్ట్రాల కార్మికుల నియామకాన్ని ఆపాలన్నారు. ప్లాంట్‌లోని 6 వేల ఉద్యోగ ఖాళీల్ని భర్తీ చేసి, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించాలన్నారు. సీఎం చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అవాస్తవ ప్రకటనలతో తమ ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు, రాష్ట్ర ప్రజలకు చేస్తున్న ద్రోహాన్ని కప్పిపెట్టడం ఆపి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించి, పరిరక్షించేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవుపలికారు.

ప్రతి నెలా మూడో శనివారం ప్రవేశం

విద్యార్థుల సందర్శనకు హెర్బేరియం, మ్యూజియం సిద్ధం


మొక్క నాటుతున్న విద్యార్థులు

మద్దిలపాలెం: ఏయూలోని వృక్షశాస్త్ర విభాగంలో ఉన్న మ్యూజియం, హెర్బేరియంలను ఇకపై విద్యార్థులు, పరిశోధకులు సందర్శించవచ్చు. గురువారం ఈ కార్యక్రమాన్ని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతి నెల మూడో శనివారం విద్యార్థులు, పరిశోధకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వృక్ష శాస్త్రంలో ఆసక్తి ఉన్నవారు సందర్శించవచ్చని వీసీ చెప్పారు. అంతరించిపోతున్న, అరుదైన వృక్ష జాతుల సమాచారం తెలుసుకోవచ్చని, ఇది పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక ప్రయోగశాలగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీసీ కోరారు.

టైటాన్స్‌కు తొలి విజయం


ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్ : పోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రో కబడ్డీ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. జైపూర్ పింక్ పాంథర్స్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన పోరులో 37–32 తేడాతో విజయం సాధించింది. టైటాన్స్ కెప్టెన్ విజయ్, ఆల్‌రౌండర్ భరత్ ఎనిమిది పాయింట్లతో రాణించగా, రైడర్లు చేతన్, అజిత్ ఐదేసి పాయింట్లు సాధించారు. గత రెండు మ్యాచ్‌లలో ఓటమి తర్వాత, ఈ విజయం టైటాన్స్‌కు పాయింట్ల ఖాతాను తెరిచింది.

దబాంగ్ ఢిల్లీకి హ్యాట్రిక్ విజయం : మరో మ్యాచ్‌లో, దబాంగ్ ఢిల్లీ హోరాహోరీగా తలపడిన పునేరి పల్టన్‌ను గోల్డెన్ రైడ్‌లో ఓడించింది. మ్యాచ్ 28–28తో డ్రా కావడంతో, గోల్డెన్ రైడ్ ద్వారా విజేతను నిర్ణయించారు. స్టార్ రైడర్ ఆషు మాలిక్ సాధించిన రెండు పాయింట్లతో దబాంగ్ ఢిల్లీ 30–28 తేడాతో గెలిచి, ఈ సీజన్‌లో హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంది. పునేరి పల్టన్ తరపున ఆదిత్య ఏడు పాయింట్లు సాధించగా, దబాంగ్ ఢిల్లీ కెప్టెన్ ఆషు సూపర్ టెన్ సాధించాడు.

ఉపాధ్యాయుల కుటుంబం

ఒకే కుటుంబంలో ఏడుగురు గురువులు

నేడు ఉపాధ్యాయ దినోత్సవం


రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి దంపతులు


రమేష్, అప్పలరాజు, ప్రసాదరావు, త్రినాథరావు, శ్రీనివాసరావు

తగరపువలస: వారు చదువుకు దూరమయ్యారు., కూలి పనులకే పరిమితమయ్యారు..అయితే తమ పిల్లల చదువు కోసం చూపిన త్యాగం ఎప్పటికీ ఆదర్శనీయం. పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన నిరక్షరాస్యులైన రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి దంపతులు తమ కష్టంతో అలాంటి అద్భుతాన్నే సృష్టించారు. వ్యవసాయ కూలీలుగా మొదలైన వారి జీవితం, నేడు ఒకే కుటుంబంలో ఏడుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులను, ఒక బ్యాంకు ఉద్యోగిని చూస్తుండడంతోనే ఎంతో ఆనందానికి లోనవుతున్నారు.

50 ఏళ్ల క్రితం వ్యవసాయ కూలీలుగా జీవితం ప్రారంభించిన ఈ దంపతులు, తమ అపారమైన కష్టంతో రెండు ఎకరాల భూమిని సంపాదించారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం ఆ భూమిని కూడా కరిగించి వారి చదువుకు వెచ్చించారు. ఫలితంగా వారి ఐదుగురు కుమారులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా జీవితంలో స్థిరపడ్డారు. 1998 డీఎస్సీలో పెద్ద కుమారుడు శ్రీనివాసరావు మన్యం జిల్లా కొమరాడలో, రెండో కుమారుడు త్రినాథరావు విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. 2008 డీఎస్సీలో మూడో కుమారుడు ప్రసాదరావు విజయనగరం జిల్లా మెరకముడిదాంలో, నాలుగో కుమారుడు అప్పలరాజు జీవీఎంసీ భీమిలి జోన్‌లో, ఐదో కుమారుడు రమేష్ విజయనగరం జిల్లా జామిలో ఉద్యోగాలు సాధించారు.

కోడళ్లు కూడా ఉద్యోగులే..

ఈ కుటుంబంలో వారి పిల్లలు మాత్రమే కాదు.. వారి కోడళ్లు కూడా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. త్రినాథరావు భార్య సుజాత విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలంలో ఉపాధ్యాయురాలిగా, అప్పలరాజు భార్య మద్దిరెడ్డి సంతోషికుమారి పద్మనాభం మండలంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే రమేష్ భార్య జి. నిర్మల గరివిడిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగినిగా పనిచేస్తున్నారు.

తల్లిదండ్రులే గురుబ్రహ్మలు

సన్యాసిరావు, ఆదిలక్ష్మి చదువుకోకపోయినా తమ పిల్లలకు అక్షర జ్ఞానమే కాదు, జీవితాన్ని ఎలా నిర్మించుకోవాలో నేర్పించారు. వారి త్యాగం, కష్టం ఈ కుటుంబానికి మార్గదర్శమయ్యాయి. ఈ కుటుంబాన్ని చూసి ఉత్తరాంధ్రలోని యువత ఉద్యోగాల కోసం ప్రేరణ పొందుతున్నారు. ఒక నిరక్షరాస్యులైన దంపతులు తమ కష్టంతో చూపిన ఈ గొప్ప విజయం, ఈ త్యాగమూర్తులను గురుబ్రహ్మలుగా తీర్చిదిద్దింది.

మా కుటుంబం చేసుకున్న పుణ్యమే



ఒక ఇంట్లో ఒక ఉద్యోగమే గగనమైన రోజుల్లో 27 ఏళ్ల క్రితం ఇద్దరు, 17 ఏళ్ల క్రితం ముగ్గురికి సమాజాన్ని సరిదిద్దే ఉపాధ్యాయ ఉద్యోగాలు రావడం ఇదంతా మా అత్తామామల పుణ్యమే.

– సంతోషికుమారి, ఉపాధ్యాయురాలు, రౌతులపాలెం పద్మనాభం

జీతాలు అందక స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల అవస్థలు

సెప్టెంబర్ 1 వరకూ 430 శాతం పెండింగ్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు జీతం ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు. జీతం చెల్లింపుపై యాజమాన్యం స్పష్టమైన తేదీ ప్రకటించకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి పరిశీలిస్తే కేవలం నాలుగు నెలలు మాత్రం నెలాఖరుకు చెల్లించారు. అది కూడా 75 శాతం జీతం కావడం గమనార్హం. గత ఏడాది సెప్టెంబర్‌లో 50 శాతం, అక్టోబర్‌లో 35 శాతం, నవంబర్‌లో 35 శాతం, డిసెంబర్‌లో 35 శాతం, జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో 25 శాతం చొప్పున వెరసి మొత్తం 330 శాతం జీతం పెండింగ్‌లో పెట్టారు. ఈనెల జీతంతో మొత్తం 430 శాతం జీతం ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంది. ఈనెల 1న జీతం చెల్లించక పోవడంతో వందలాది మంది ఉద్యోగులు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు, గృహ, వాహన రుణాలు చెల్లించలేకపోయారు. దీంతో వారు లబోదిబోమంటున్నారు. ప్రతీ నెలా ఇచ్చేదే అరకొర జీతం.. దానిని కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇగ్నో నర్సింగ్ కోర్సులో 30 మందికి ప్రవేశాలు

ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) నిర్వహిస్తున్న బీఎస్సీ నర్సింగ్ కోర్సులో 30 మంది ప్రవేశం పొందారు. మార్చిలో జరిగిన ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సాధించిన మెరిట్ ఆధారంగా గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు ఇచ్చినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో అందిస్తున్న ఇతర పీజీ, డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.

ప్రజారోగ్య మౌలిక వసతులకు పవర్ గ్రిడ్ ప్రాధాన్యత


హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి రూ.32 కోట్ల విలువైన యంత్రాన్ని అందిస్తున్న పవర్‌గ్రిడ్ యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: ప్రజారోగ్యానికి పవర్‌గ్రిడ్ సంస్థ ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగా అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రికి రూ. 32.50 కోట్ల విలువైన అధునాతన లినాక్ యంత్రాన్ని అందించినట్లు పవర్‌గ్రిడ్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ యతీంద్ర ద్వివేది తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగమని ఆయన పేర్కొన్నారు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతిశెట్టి మాట్లాడుతూ లినాక్ యంత్రం సహాయంతో స్టీరియోటాక్టిక్ రేడియోథెరపీ, టోటల్ బాడీ ఇరాడికేషన్, టోటల్ మారో ఇరాడికేషన్ వంటి అత్యాధునిక చికిత్సలను రోగులకు అందించవచ్చని తెలిపారు. దీనివల్ల రోగులపై ఆర్థిక భారం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సహకారానికి పవర్‌గ్రిడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్) వంశీరామ్మోహన్ బుర్రా, స్వతంత్ర డైరెక్టర్లు శివతపస్వ పాశ్వాన్, రోహిత్ వాస్వానీ, సజల్ ఝా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.121
బ్రాయిలర్ (లైవ్)	: రూ.141
స్కిన్	: రూ.252
స్కిన్‌లెస్	: రూ.262

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	555.00
విజయనగరం	559.00
శ్రీకాకుళం	559.00

కొత్త లాండ్రీ సదుపాయం ప్రారంభం


అల్ట్రా వాష్ టెక్స్‌లో నూతన మెషినరీని ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం : ఆటోనగర్‌లోని అల్ట్రావాష్ టెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొత్త సదుపాయాన్ని వాల్తేరు రైల్వే డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం ప్రారంభించారు. రైల్వే బెడ్ రోల్స్, లెనిన్‌లను శుభ్రం చేయడానికి అధునాతన మెషినరీతో కూడిన స్టీమ్ బాయిలర్‌ను ఈ సంస్థలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డీఆర్ఎం యూనిట్‌లోని బెడ్‌షీట్ క్యాలెండరింగ్, ఫోల్డింగ్ మెషిన్, వాషర్ ఎక్స్‌ట్రాక్టర్స్ వంటి వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. అల్ట్రావాష్ టెక్స్ సంస్థ గత 14 ఏళ్లుగా విశాఖపట్నం ప్రాంతంలో రైల్వేలకు లాండ్రీ , డ్రై క్లీనింగ్ సేవలను అందిస్తోంది. ఈ యూనిట్ ఒక షిఫ్ట్‌లో 7.5 టన్నుల వస్త్రాలను శుభ్రపరిచే సామర్థ్యం కలిగి ఉంది. అల్ట్రా గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.జి. త్రినాథరావు, డైరెక్టర్ ఎల్. సాయి వందన అందించిన సేవలను డీఆర్ఎం ఈ సందర్భంగా ప్రశంసించారు.

కూటమి హామీలు నిలబెట్టుకోవాలి


అసోసియేషన్ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి త్రినాథ్

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ జేఏసీ (అమరావతి) డిమాండ్ చేసింది. గురువారం విశాఖలో జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఏపీ జేఏసీ రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు మాట్లాడుతూ వెంటనే ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ , 11వ పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల వివరాలను సీఎఫ్ఎంఎస్, పే స్లిప్పుల్లో చూపించాలని, గ్రామ–వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు.కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి., మహిళా ఉద్యోగులకు రెండేళ్ల చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విశాఖ, భీమలి డివిజన్‌లకు కొత్త కమిటీలను కూడా ఎన్నుకున్నారు.

ఫెయిర్ గ్రో కేసులో ముగ్గురి అరెస్ట్

ఎంవీపీకాలనీ: నగరానికి చెందిన ఫెయిర్ గ్రో ట్రేడర్స్ సంస్థ భారీ ఆర్థిక కుంభకోణానికి పాల్పడిన కేసులో గురువారం ముగ్గురు నిర్వాహకుల్ని అరెస్ట్ చేశారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెట్టుబడులపై వారానికి 10 శాతం రాబడి ఇస్తామంటూ ఆశచూపి నగరవాసుల నుంచి సంస్థ ప్రతినిధులు భారీ వసూళ్లకు పాల్పడిన విషయం తెలిసిందే. సుమారు రూ.5 కోట్లు నుంచి రూ.10 కోట్లు వరకు వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటికే ఈ ఘటనపై రోహిత అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, మరింత మంది నుంచి ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంస్థ నిర్వాహకులు నరమామిడి వెంకట ప్రవతి నంద కిషోర్ (58), అతని భార్య రామనాంబ (56), కుమారుడు ప్రభు నందన్ (31)లను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. ఈ సంస్థ చేతిలో మరింత మంది ఆర్థికంగా మోసపోయినట్లు ఎంవీపీ పోలీసులను ఆశ్రయించడంతో ఆయా ఫిర్యాదులపైనా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎంవీపీ కాలనీ సీఐ మురళీ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసింది.

కన్యాకుమారి-హౌరా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు...

తాటిచెట్లపాలెం: హౌరా–కన్యాకుమారి–హౌరా ఎక్స్‌ప్రెస్‌కు మధురై డివిజన్ పరిధిలో అదనపు హాల్ట్‌ను ఇస్తున్నట్లు, ఆయా తేదీలలో ఈరైలును దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 6,13,20,27వ తేదీలలో కన్యాకుమారిలో బయల్దేరే కన్యాకుమారి–హౌరా జంక్షన్ ఎక్స్‌ప్రెస్ ..విరుధునగర్, మనమదురై జంక్షన్, కరక్కుడి, తిరుచ్చిరాపల్లి ఫోర్ట్ స్టేషన్‌ల మీదుగా నడుస్తుంది. ఈ తేదీలలో ఈ రైలు అరుప్పుకొట్టయ్, మధురై జంక్షన్, శివగంగ, కరక్కుడి, పుదుకొట్టయ్ స్టేషన్‌లలో అదనపు హాల్ట్‌ను ఇచ్చారు. శుక్రవారం నుంచి విశాఖలో బయల్దేరే విశాఖ–అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు రెండువైపులా బెల్‌పహర్ స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నారు.